సాక్షి నిజామాబాద్

శనివారం । 12 । జూలై । 2025



ఊర పండుగకు సిద్ధం

ఇందూరు నగరం రేపు జరగనున్న ఊర పండుగకు సర్వం సిద్ధమైంది. నకాస్ గల్లీలో కొత్త విగ్రహాలను తయారు చేస్తున్నారు.

- 8లో ▸



చేరికలు లేవు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరదల నియంత్రణ విభాగం(ఫ్లడ్ కంట్రోల్)లో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.7 /22.8

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఓటరు నమోదు సక్రమంగా నిర్వహించాలి



రుద్రూర్: ఓటరు నమోదు ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పేర్కొన్నారు. పోతంగల్ మండల కేంద్రంలో శుక్రవారం కోటగిరి ఉమ్మడి మండలాల బీఎల్‌వోలకు అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట తహసీల్దార్ గంగాధర్, డిప్యూటీ తహసీల్దార్ అజీజ్, ట్రైనర్లు నరహరి, అశోక్ తదితరులు ఉన్నారు.

చేపపిల్లల ఉత్పత్తి షురూ



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన ఉన్న జాతీయ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రంలో చేపపిల్లల ఉత్పత్తిని శుక్రవారం ప్రారంభించారు. కేంద్రంలో గతం నుంచి ఉన్న జార్ హెచరీలతోపాటు ఎకో హెచరీలలో చేపగుడ్లను పొదగవేసి బాయిల్డ్ ప్రక్రియ మొదలుపెట్టారు. చేపపిల్లల ఉత్పత్తికి అధికారులు నెల రోజుల నుంచి తల్లి చేపలను సేకరించారు. ఈ కేంద్రానికి 5 కోట్ల చేపపిల్లలను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. మొదట తల్లి చేపల నుంచి సేకరించిన గుడ్లను హెచరీలో పొదగ వేసి బాయిల్డ్ చేస్తారు. మూడు రోజుల తర్వాత స్పాన్ విడుదలవుతుంది. స్పాన్ నుంచి చేపపిల్లలు ఉత్పత్తి అవుతాయి. వాటిని సిమెంట్ కుండీలో నిల్వ ఉంచి అంగుళం సైజ్ పెరిగిన తర్వాత మత్స్య సహకార సంఘాలకు సబ్సిడీపై సరఫరా చేస్తారు. నాణ్యమైన చేపపిల్లల ఉత్పత్తి చేపడుతామని మత్స్యశాఖ ఏడీ ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో మత్స్య అభివృద్ధి అధికారి దామోదర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో కేసులు పరిష్కరించాలి

- సీపీ సాయి చైతన్య
- పోలీస్ స్టేషన్ రైటర్లకు శిక్షణ ప్రారంభం



ఖలీల్‌వాడి: ప్రస్తుత కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగిస్తూ కేసులను పరిష్కరించాలని కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయి చైతన్య పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో పోలీస్‌స్టేషన్ రైటర్లకు శుక్రవారం ఆయన శిక్షణ ప్రారంభించారు. సీపీ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కేసుల ఛేదనలో పరిపక్వతను సాధించాలన్నారు. కేసుల పరిశోధనలో నాణ్యతను పెంచి ఎఫ్ఐఆర్ నుంచి చార్జ్‌షీట్ రిపోర్టు వరకు పాటించాల్సిన మెళకువలను వివరించారు. నూతన చట్టాలు, టెక్నాలజీపై అవగాహన కల్పించారు. ఫోరెన్సిక్ సైన్స్ వాడకం, కోర్టులో వేసే చార్జ్‌షీట్ తయారీ విధానాన్ని తెలిపారు. శిక్షణ అనంతరం సంబంధిత పీఎస్‌కు వెళ్లిన తర్వాత సిబ్బందికి, సంబంధిత అధికారికి శిక్షణ కాలంలో నేర్చుకున్న అంశాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి, ట్రైనింగ్ సీటీసీ ఏసీపీ మస్తాన్ అలీ, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.43 లక్షల గుట్కా పట్టివేత?

ఖలీల్‌వాడి: నగరంలోని అర్సపల్లి, ఆటోనగర్ ప్రాంతంలోని ఓ గోదాంలో నిల్వ చేసిన రూ.43 లక్షల విలువ చేసే గుట్కాను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. భారీగా ఉన్న గుట్కాకు జీఎస్టీ చెల్లించలేదని, దీంతో పోలీస్ ఉన్నతాధికారులు గుట్కాను పరిశీలించినట్లు సమాచారం. దీనిపై పోలీసులు కేసు నమోదు చేస్తారా లేక జీఎస్టీతో సరిపెడతారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.



'ఆయువు నేనే
ప్రాణవాయువు నేనే
కూడు నేనే
గూడు నేనే
గుడ్డ నేనే
పాడె నేనే
కాడి నేనే
బతుకుతెరువు నేనే
బతుకంతా నేనే
తాత జీడి నేనే
చేతి కర్ర నేనే
మోసే కట్టె నేనే
కాల్చే కట్టె నేనే
చివరికి అంతా నేనే'

- గ్రీన్ వారియర్ రావుట్ల జనార్దన్ రాసిన హరిత పంక్తులు.

అడవిలో చల్లేందుకు సిద్ధం చేసిన సీడ్‌బాల్స్, చిత్రంలో గ్రీన్ వారియర్ జనార్దన్, అధికారులు, యువకులు



వనమహోత్సవం.. కావాలి

జనమహోత్సవం

పచ్చదనం పెంపొందించడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములైతేనే మేలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: వనమహోత్సవాన్ని జనమహోత్సవంగా చేసేందుకు ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉంది. భావితరాలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలంటే పర్యావరణాన్ని పరిరక్షించేందుకు చేయీ చేయీ కలిపి ఉద్యమంలాగా ముందుకు సాగాలి. ఈ ఏడాది వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా అధికారులు జిల్లాలో 28.87 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా, 2016 నుంచి 2024 వరకు జిల్లాలో 4,32,93,430 మొక్కలు నాటగా 3,27,38,541 మొక్కలు బతికాయి. ఇందులో ప్రజలంతా భాగస్వాములు కావడంతో పాటు నాటిన మొక్కల సంరక్షణ విషయంలోనూ నిబద్ధతతో వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

- ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 28.87 లక్షల మొక్కలు నాటేందుకు అధికారుల ప్రణాళిక
- 2016–17 నుంచి జిల్లాలో నాటిన మొక్కలు 4,32,93,430.. బతికినవి 3,27,38,541
- జిల్లాలో 2.5 లక్షల మొక్కలు నాటిన గ్రీన్ వారియర్ రావుట్ల జనార్దన్

అంకురిత దీక్షతో మొక్కలు నాటుతున్న రావుట్ల జనార్దన్..

సిరికొండ మండలం మైలారం గ్రామానికి చెందిన రావుట్ల జనార్దన్ నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఉంటూ 2009 డిసెంబర్ 23 నుంచి పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడుతూ గ్రీన్ వారియర్‌గా పేరుపొందారు. సుభాష్ పాలేకర్, ఖమ్మంకు చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత, దివంగత వనజీవి రామయ్య స్ఫూర్తితో మొక్కలు నాటే కార్యక్రమాన్ని జనార్దన్ చేపడుతున్నారు. జీవనాధారం కోసం తాను పెళ్లిపత్రికల ప్రింటింగ్ ప్రెస్ నడుపుతున్నారు. పరిమిత సంపాదనతోనే కుటుంబాన్ని పోషించుకుంటూ మరోవైపు పర్యావరణ పరిరక్షణ కోసం నిరంతరం పాటుపడుతున్నారు. మొక్కలు నాటేందుకు గాను తనకున్న రెండు ప్లాట్లను సైతం అమ్ముకున్నారు. సిరివెన్నెల గ్రీన్ సొసైటీ స్థాపించి మొక్కలు నాటుతున్నారు జనార్దన్. ఇప్పటివరకు జిల్లాలో 2.5 లక్షల మొక్కలు నాటారు. మరోవైపు విద్యార్థులు, వివిధ సంస్థల ద్వారా మరో 12.5 లక్షల మొక్కలు నాటించారు. అదేవిధంగా నల్లగొండ జిల్లాకు చెందిన పట్లోళ్ల రాంరెడ్డి స్థాపించిన గ్రామభారతి సంస్థకు జిల్లా బాధ్యుడిగా జనార్దన్ వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ సంస్థ ద్వారా జిల్లాలో 250 మంది రైతులు తమకున్న సాగుభూమిలో కొద్దిమేర సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. ఇక అడవుల్లో పండ్ల చెట్లు ఉండాలనే లక్ష్యంతో జనార్దన్ ప్రతి సంవత్సరం అటవీ ప్రాంతాల్లో సీడ్ బాల్స్ (విత్తన బంతులు) చల్లుతున్నారు. అదేవిధంగా మొక్కల రవాణా కోసం జనార్దన్ సొంతంగా ట్రాలీ ఆటో ఏర్పాటు చేసుకున్నారు.

ఎండాకాలంలో అడవి జంతువులకు, కోతులకు ఆహార ఉత్పత్తులను అందించే అరటి, కొబ్బరి మొక్కలు ఇచ్చే కార్యక్రమం చేపడుతున్నారు. చెట్ల వద్ద ఎండిన గింజలను, విత్తనాలను నిత్యం సేకరిస్తున్నారు. ఫంక్షన్లలో కొబ్బరి మొక్కలను బహుమతిగా ఇస్తున్నారు. నిత్యం ఆకుపచ్చ చొక్కాతోనే కనిపించే జనార్దన్ అదే రంగు బైక్, హెల్మెట్, మాస్క్, పెన్ను, సెల్‌ఫోన్ పౌచ్ వాడుతున్నారు. దుకాణంలో, ఇంట్లో కుర్చీలు, బల్లలు సైతం ఆకుపచ్చ రంగులోనే ఉండేలా చూసుకుంటున్నారు. మనిషి కారణంగానే భవిష్యత్ తరాల మనుషులకు, ఇతర జీవరాశులకు ముప్పు ఏర్పడుతోందని చెబుతున్న జనార్దన్ 2015లో 'చెట్లుంటే పురోగతి–లేకుంటే అధోగతి' అనే పుస్తకం రాశారు. ప్రతి ఏటా అప్‌డేట్ చేస్తూ ఈ పుస్తకంలో అదనపు వివరాలు జోడించి ముద్రణ చేస్తున్నారు. ఇప్పటివరకు ఉచితంగా 12 వేల పుస్తకాలు పంచిపెట్టారు. జనార్దన్‌ను అప్పటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్, హైకోర్టు న్యాయమూర్తులు శ్రీసుధ, జీవీ సుబ్రహ్మణ్యం సన్మానించారు.



మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న జనార్దన్



సేకరించిన విత్తనాలతో జనార్దన్



మొక్కల రవాణాకు సమకూర్చుకున్న వాహనం



విద్యార్థులతో సీడ్ బాల్స్ తయారీ

సేంద్రియ వ్యవసాయంతోనే భూసారం : రావుట్ల జనార్దన్

ప్రస్తుతం విచ్చలవిడిగా పురుగుమందులు, రసాయన ఎరువులు వేస్తుండడంతో మరో 20 ఏళ్లలో మన వ్యవసాయ భూమి సాగుకు పనికిరాకుండా పోతుంది. రైతులు సుభాష్ పాలేకర్ విధానంలో ప్రకృతి వ్యవసాయం చేయాలి. దీంతో ప్రతి ఒక్కరికీ మంచి ఆహారం లభిస్తుంది. రైతులు దశల వారీగా సేంద్రియ వ్యవసాయం చేపట్టాలి. మొదట రైతుకు ఉన్న భూమిలో 5 శాతం నుంచి సేంద్రియ వ్యవసాయం ప్రారంభించాలి. తరువాత దశలవారీగా సేంద్రియ సాగు విస్తీర్ణం పెంచుకుంటూ పోవాలి. దీంతో ప్రజారోగ్యంపై భారీగా డబ్బు వెచ్చించాల్సిన పరిస్థితి తప్పుతుంది. పంజాబ్ నుంచి ప్రతిరోజూ ఢిల్లీకి క్యాన్సర్ పేషంట్ల రైలు వెళుతోంది. ఇక్కడ కూడా ఇలా కాకుండా చూడాలి. భవిష్యత్ తరాలకు మేలు కలగాలంటే రైతులు సేంద్రియ వ్యవసాయానికి పూనుకోవాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో హరితహారం (వనమహోత్సవం)లో నాటిన మొక్కల వివరాలు

సంవత్సరం	నిర్ణయించిన లక్ష్యం	నాటిన మొక్కలు	ఇండ్లకు పంపిణీ చేసిన మొక్కలు	బతికిన మొక్కలు	బతికిన మొక్కల శాతం
2016-17	6689363	6636197	53166	4280088	64.50
2017-18	8254572	6323871	1930701	3375186	53.37
2018-19	11936338	8406057	3530281	4758151	56.60
2019-20	11955503	9999883	1955620	9027700	90.28
2020-21	4862176	2897768	1964408	2743639	94.68
2021-22	3858930	2573245	1285685	2451414	95.27
2022-23	3022621	3022621	1215580	2897819	95.87
2023-24	2809000	1572518	1236482	1505894	95.76
2024-25	2513618	1861270	930018	1698650	91.26

తాటిపల్లి అడవుల్లో పెద్దపులి సంచారం



- నిర్ధారించిన అటవీ శాఖ అధికారులు



పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

సిరికొండ: నిజామాబాద్ సిరికొండ అటవీ రేంజ్ పరిధిలోని తాటిపల్లి, జినిగ్యాల బీట్ అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరించినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. తాటిపల్లి శివారులోని మల్లం చెరువు, తాంట్ల కుంటలో చేపలు పట్టేందుకు వెళ్లినవారికి పాద ముద్రలు కనిపించాయి. అనుమానం వచ్చి సమాచారం ఇచ్చారని రేంజర్ రవీందర్ తెలిపారు. ఆర్మూర్ ఎఫ్‌డీవో భవానీశంకర్, రేంజ్ ఆఫీసర్ రవీందర్, యానిమల్ ట్రాకర్స్, ఎన్‌జీవో వెంకట్, రేంజ్ సిబ్బంది శుక్రవారం ఆయా ప్రాంతాల్లో సంచరించారు. పాదముద్రలను పరిశీలించి మగ పెద్దపులిగా నిర్ధారించారు. గతంలో ఏటీఆర్ ఖానాపూర్ ఏరియా అటవీ ప్రాంతంలో సంచరించిన ఎస్12 పెద్దపులి అని గుర్తించారు. ఐదారు నెలల నుంచి జగిత్యాల జిల్లా కొడిమ్యాల రేంజ్, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రేంజ్ పరిధిలో తిరిగి ఇటువైపు వచ్చినట్లు రేంజర్ తెలిపారు. పెద్దపులి సంచారం నేపథ్యంలో అటవీ ప్రాంతాలకు సమీపంలో ఉన్న తండాలకు చెందిన గిరిజనులు, మేకల, పశువుల కాపర్లు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రైతులు పొలాల వద్ద కరెంటు తీగలను ఏర్పాటు చేయవద్దని పేర్కొన్నారు. అటవీ అధికారులు, యానిమల్ ట్రాకర్స్ ప్రతిరోజు గస్తీ తిరుగుతూ పులి కదలికలను పసిగడతామని, సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేస్తున్నట్లు రేంజర్ వివరించారు.

పంట రుణాల పంపిణీకి ప్రాధాన్యమివ్వాలి

- కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి
- జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో వార్షిక రుణ ప్రణాళిక విడుదల
- రూ.17990.59 కోట్ల రుణ లక్ష్యం ఖరారు



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, పక్కన అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్డీవో సాయాగౌడ్

నిజామాబాద్ అర్బన్: జిల్లాకు వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్నందున పంట రుణాల పంపిణీకి అధిక ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి హితవు పలికారు. రుణాల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు అంకిత భావంతో కృషి చేస్తూ, ఆయా వర్గాల అభ్యున్నతికి బ్యాంకర్లు దోహదపడాలని సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశం నిర్వహించారు. ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి, ప్రస్తుత సీజన్‌కు అందించాల్సిన పంట రుణాలు తదితర అంశాలపై బ్యాంకుల వారీగా సమీక్షించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రుణ ప్రణాళికను విడుదల చేశారు. వ్యవసాయ, అనుబంధ, వ్యవసాయేతర, ఇతర అన్ని రంగాలకు కలిపి రూ. 17990.59 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో ప్రాధాన్యత రంగాలకు రూ. 13928.92 కోట్ల రుణ సదుపాయం కల్పించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పూర్తిస్థాయిలో పంట రుణాల లక్ష్యాన్ని సాధించేందుకు బ్యాంకర్లు చొరవ చూపాలన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు వీలుగా విద్యా రుణాలను అందించాలన్నారు. వివిధ వర్గాల అభ్యున్నతి, ఆర్థిక ప్రగతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాలకు బ్యాంకర్లు సహకరించాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలను సమర్థవంతంగా అందించాలన్నారు. వీధి వ్యాపారాలు నిర్వహించే వారికి సూక్ష్మ రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించి స్వయం ఉపాధికి చేయూతనివ్వాలన్నారు. ఎస్‌బీఐ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ పూర్తి చేస్తున్న గ్రామీణ ప్రాంత యువత యూనిట్ల స్థాపన కోసం రుణాలివ్వాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్బీఐ ఎల్‌డీవో రాములు, డీఆర్డీవో సాయాగౌడ్, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ అశోక్ చవాన్, నాబార్డు ఏజీఎం ప్రవీణ్ కుమార్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి సన్నద్ధం

- త్వరలో విడుదలకానున్న నోటిఫికేషన్
- జిల్లాలో మొత్తం 680 ఖాళీలు



నిజామాబాద్‌నాగారం: చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు నాణ్యమైన పౌష్టికాహారం, చిన్న పిల్లలకు ప్రీ ప్రైమరీ విద్యను అందించేందుకు అంగన్‌వాడీ టీచర్, సహాయకుల పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అందుకు సంబంధించి త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఇప్పటికే జిల్లాలోని ఖాళీల వివరాలను ప్రభుత్వం తెప్పించుకుంది. పోస్టుల భర్తీకి కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా సంక్షేమశాఖ అధికారి ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించి ప్రత్యేక కమిటీ ద్వారా నియామక ప్రక్రియ పూర్తి చేస్తారు.

అర్హతలు ఇవే..

ఇది వరకు ఆయాగా విధులు నిర్వహిస్తున్న వారికి అర్హత ఉండి టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో పదోన్నతుల ద్వారా పూర్తిచేశారు. గతంలో అంగన్‌వాడీ టీచర్ పోస్టుకు 10వ తరగతి అర్హత ఉండేది. ప్రస్తుతం ఇంటర్ పూర్తి చేసిన వారు మాత్రమే టీచర్ పోస్టుకు దరఖాస్తులు చేసుకోవాలి. ఆయా పోస్టులకు 7వ తరగతి ఆపై చదువుకున్న వారు కూడా అర్హులు. దీంతో నోటిఫికేషన్ కోసం నిరుద్యోగ మహిళలు ఎదురుచూస్తున్నారు.

జిల్లాలో ఖాళీలు ఇలా..

జిల్లా వ్యాప్తంగా ఐదు సీడీపీవో కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ ఉన్నాయి. వీటి పరిధిలో 1500 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, జిల్లా వ్యాప్తంగా 75 అంగన్‌వాడీ టీచర్లు, 605 ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అధికారులు ఇప్పటికే ఖాళీల జాబితా సిద్ధంగా ఉంచారు. కాగా, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పదవీ విరమణ వయస్సు 65 సంవత్సరాలకు పెంచిన విషయం తెలిసిందే. వయస్సుపైబడినవారు పదవీ విరమణ చేస్తే మరిన్ని పోస్టులు ఖాళీ అయ్యే అవకాశం ఉంది.

గైడ్‌లైన్స్ రాగానే భర్తీ చేస్తాం

జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టులకు సంబంధించిన ఖాళీల జాబితా సిద్ధంగా ఉంది. ప్రభుత్వం నుంచి గైడ్‌లైన్స్ రాగానే నియమ, నిబంధనల ప్రకారం భర్తీకి చర్యలు తీసుకుంటాం. త్వరలోనే నోటిఫికేషన్ వస్తుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తాం.

– రసూల్‌బీ, జిల్లా సంక్షేమాధికారి

జనాభా నియంత్రణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

- డీఎంహెచ్‌వో రాజశ్రీ

నిజామాబాద్‌నాగారం: జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి రాజశ్రీ పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగరంలోని చంద్రశేఖర్ కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతి మహిళ శరీరం, మనసు సిద్ధంగా ఉన్నప్పుడే తల్లి కావడానికి సరైన సమయమని అన్నారు. మాతాశిశు మరణాలకు, జనాభా పెరుగుదలకు కారణమైన బాల్య వివాహాలను చేసుకోవద్దన్నారు. అర్హులైన దంపతులందరూ శాశ్వత, తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులను అవలంబించేలా ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు అవగాహన కల్పించాలని సూచించారు. పురుషుల కోసం ఎన్ఎస్‌వీ/వెసక్టమీ ఆపరేషన్లు ఆర్మూర్, డిచ్‌పల్లి, మోర్తాడ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంజనా, జిల్లా మలేరియా అధికారి తుకారం రాథోడ్, పీవో ఎంసీహెచ్ సుప్రియ, పీవోఎన్‌సీడీ సామ్రాట్ యాదవ్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి శిఖర, డెమో నాగలక్ష్మి, డీహెచ్‌ఈలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజలు ఆర్టీసీని ఆదరించాలి



ఆర్మూర్‌టౌన్‌: ప్రజలు ఆర్టీసీ ఆదరించాలని కరీంనగర్‌ జోనల్‌ ఈడీ సాల్మన్‌ రాజ్‌ అన్నారు. అలాగే ఆర్టీసీ అభివృద్ధికి కృషిచేయాలని సిబ్బందికి సూచించారు. బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు క్షేమంగా చేర్చాలన్నారు. ఆర్మూర్‌ పట్టణంలోని ఆర్టీసీ డిపోను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. డిపోలోని రికార్డులను పరిశీలించారు. ప్రాంగణంలోని దుకాణలను పరిశీలించి ఎంఆర్పీ రేట్లకు వస్తువులు విక్రయించాలని వారికి తెలిపారు. ఇటీవల జరిగిన నిజామాబాద్‌–2 డిపో డ్రైవర్‌ ఆత్మహత్యయత్నం గురించి విలేకరులు ప్రశ్నించగా విచారణ చేస్తామని వెళ్లిపోయారు. ఆర్‌ఎం జ్యోత్స్న, డిపో మేనేజర్‌ రవికుమార్‌, సిబ్బంది పాల్గొన్నారు.

తెయూ సమస్యలను పరిష్కరించాలి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్‌ డిమాండ్‌ చేశారు. ఈమేరకు శుక్రవారం తెయూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రిజిస్ట్రార్‌ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రాజేశ్వర్‌ మాట్లాడుతూ.. యూనివర్సిటీలో అదనంగా మరొక గర్ల్స్‌ హాస్టల్‌ నిర్మించాలని, ఈ విద్యాసంవత్సరం నుంచే ఇంజినీరింగ్‌ కోర్సులను ప్రవేశపెట్టాలన్నారు. హాస్టల్‌ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. మెస్‌ బిల్లులలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని డిమాండ్‌ చేశారు. వర్సిటీకి న్యాక్‌ ఏ గ్రేడ్‌ కోసం చర్యలు తీసుకోవాలని, ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ సీట్లను ప్రభుత్వ అనుమతితో ప్రవేశ పరీక్ష నిర్వహించి భర్తీ చేయాలని కోరారు. నాయకులు ప్రిన్స్‌, హుస్సేన్‌, గౌతం, రాజేందర్‌, భూమేష్‌, రాజేష్‌, సాయి తదితరులు పాల్గొన్నారు.

విరమణలే తప్ప చేరికలు లేవు

- ఎస్సారెస్పీ ఫ్లడ్‌ కంట్రోల్‌లో సిబ్బంది కొరత
- 60 మందికి మిగిలింది ఇద్దరే
- కాంట్రాక్ట్‌ సిబ్బందితో నెట్టుకొస్తున్న యంత్రాంగం



ఎస్సారెస్పీ డ్యాంపై ఉన్న ఫ్లడ్‌ కంట్రోల్‌ రూం

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లో వరదల నియంత్రణ విభాగం (ఫ్లడ్‌ కంట్రోల్‌)లో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ విభాగంలో సిబ్బంది పదవీ విరమణలే తప్ప నూతనంగా పోస్టింగ్‌లు ఇచ్చిన దాఖలాలు లేవు. దీంతో వరదలు వచ్చే సమయంలో అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రాజెక్ట్‌లో గతంలో 60 మంది సిబ్బంది పని చేసేవారు. ప్రస్తుతం ఒక మ్యాన్‌ మజ్దూర్‌, ఒక వాచ్‌మన్‌ మాత్రమే మిగిలారు. ప్రాజెక్ట్‌ ఫ్లడ్‌ విభాగంలో ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారు. మిగతా వారందరు కాంట్రాక్టర్‌ సప్లయ్‌ చేసే మ్యాన్‌ పవర్‌ ఉంది.

ఫ్లడ్‌ సీజన్‌ 4నెలలు..

శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లో నాలుగు నెలలు ఫ్లడ్‌ సీజన్‌ ఉంటుంది. జూలై నుంచి అక్టోబర్‌ వరకు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుంది. ఈ నాలుగు నెలలు రాత్రి, పగలు సిబ్బంది షిఫ్ట్‌ ప్రకారం విధులు నిర్వహిస్తారు. కానీ ఉన్న ఇద్దరితో అధికారులు ఎలా విధులు నిర్వర్తించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్ట్‌ మెయింటనెన్స్‌ కోసం టెండర్‌ ద్వారా దక్కించుకున్న కాంట్రాక్టర్‌ మ్యాన్‌ పవర్‌తో నెట్టుకువస్తున్నారు. కానీ గేట్లు ఆపరేట్‌ చేయాలంటే కనీస పరిజ్ఞానం ఉండాలి. మ్యాన్‌ మజ్దూర్‌లు లేకపోవడంతో వారితోనే పని చేయిస్తున్నారు. ఫ్లడ్‌ కంట్రోల్‌ విభాగం సిబ్బందికి సీజన్‌లో వారికి రేయిన్‌ కోటు, బూట్లు, డ్రెస్‌లు గతంలో ప్రభుత్వం సరఫరా చేసేది. కానీ ప్రస్తుతం అవేమి కనిపించడం లేదు. ప్రభుత్వం సరఫరా చేయడం లేదంటూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. కనీసం టార్చ్‌ లైట్‌ కూడ ఇవ్వలేని దుస్థితి ఉందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అత్యవసర సేవల్లో భాగమైన ఫ్లడ్‌ కంట్రోల్‌ సిబ్బంది కొరత గురించి పట్టించుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. వెంటనే సిబ్బందిని నియామించాలని వేడుకుంటున్నారు.

ప్రభుత్వం స్పందించాలి..



ప్రాజెక్ట్‌లోకి మీది నుంచి ఎక్కువగా వరద నీరు వచ్చినప్పుడు రాత్రి, పగలు ఇక్కడే డ్యూటీ చేయాలి. కనీసం రేయిన్‌ కోటు, బూట్లు కూడ ఇవ్వడం లేదు. ఇక్కడ గతంలో 60 మందితో పని చేసేవాళ్లం. అందరు ఉద్యోగం దిగిపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సిబ్బందిని నియమించి, సౌకర్యాలు కల్పించాలి.

– అబ్దుల్‌ మాజీద్‌, వాచ్‌మన్‌, ఎస్సారెస్పీ

ఇంటర్‌లో అడ్మిషన్లు, హాజరు శాతం పెంచాలి

- ఇంటర్‌ విద్య ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా ప్రత్యేక అధికారి ఒడ్డెన్న
- జిల్లాలోని పలు ప్రభుత్వ కాలేజీల తనిఖీ


అయిలాపూర్‌లో అధ్యాపకులతో మాట్లాడుతున్న ఇంటర్‌ విద్య ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ఒడ్డెన్న

నందిపేట్‌(ఆర్మూర్‌): ఇంటర్‌ విద్యలో అడ్మిషన్లతో పాటు విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఇంటర్‌ ఎడ్యుకేషన్‌ ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి ఒడ్డెన్న సూచించారు. నందిపేట మండలంలోని అయిలాపూర్‌లో గల ప్రభుత్వ జూనియర్‌ కళాశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ కళాశాలలోని సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వ ప్రయివేట్‌ పాఠశాలలను సందర్శించి ఎస్సెస్సీ పూర్తయిన విద్యార్థులు ఎక్కడ చేరారో వివరాలు సేకరించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలో చేర్పించే విధంగా వారి తల్లిదండ్రులను ఒప్పించాలన్నారు. అడ్మిషన్ల ప్రక్రియను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఇంటర్‌ బోర్డు మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్‌ చిన్నయ్య, స్టేట్‌ అడ్మిషను ఆఫీసర్‌ నర్సయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలను ప్రత్యేకాధికారి ఒడ్డెన్న పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు గణనీయంగా పెరగడం అభినందనీయమన్నారు. విద్యార్థుల డ్రాపౌట్స్‌ సంఖ్యను తగ్గించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి, ప్రతిఒక్కరు మొక్కలను సంరక్షించాలన్నారు. ప్రిన్సిపాల్‌ విజయానంద్‌రెడ్డి, అధ్యాపకులు చంద్రశేఖర్‌, నరేష్‌, సుభాష్‌, విజయలక్ష్మీ, రామకృష్ణ, కృష్ణమోహన్‌ పాల్గొన్నారు.

మోర్తాడ్‌: మోర్తాడ్‌ జూనియర్‌ కళాశాలలో అధ్యాపకులతో ప్రత్యేకాధికారి ఒడ్డెన్న సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్యపై అందరికి అవగాహన కల్పించి అడ్మిషన్ల సంఖ్య పెంచాలని సిబ్బందికి తెలిపారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలను నాటించారు. నర్సయ్య, గంగాధర్‌ తదితరులు ఉన్నారు.

బాల కార్మికుడి గుర్తింపు: యజమానిపై కేసు

మాక్లూర్‌: మెకానిక్‌ షెడ్‌లో బాలుడిని పనిలో పెట్టుకున్న యజమాని సయ్యద్‌ మంజూర్‌ హైమద్‌పై కేసునమోదు చేసినట్టు ఎస్సై రాజశేఖర్‌ శుక్రవారం తెలిపారు. బాలకార్మిక నిర్మూలన జిల్లా అధికారి స్వప్న ఆధ్వర్యంలో ప్రత్యేక టీం సభ్యులు అప్పారావు, శంకర్‌లు శుక్రవారం మండల కేంద్రంలోని మెకానిక్‌ షెడ్‌లో 16 సంవత్సరాల బాబు పని చేస్తున్నట్టు గుర్తించారు. యజమానిపై బాలకార్మిక నిర్మూలన అధికారిణి స్వప్న ఫిర్యాదు చేయగా అతడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

స్కూల్‌ స్లాబ్‌ ధ్వంసం చేసిన వారిపై కేసు

రుద్రూర్‌: కోటగిరి మండలం హరిలాల్‌ తండా ప్రభుత్వ బడి గోడలు, స్లాబ్‌ను ధ్వంసం చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై సునీల్‌ శుక్రవారం తెలిపారు. సుద్దులం తండాకు చెందిన శంకర్‌, సేవాలాల్‌ తండాకు చెందిన శ్రీకాంత్‌ జేసీబీతో స్కూల్‌ గోడలు, స్లాబ్‌ ను ధ్వసం చేశారని హెచ్‌ఎం సుల్తానా ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగం


మద్దికుంటలోని బుగ్గ రామలింగేశ్వర ఆలయం


ఆలయంలోని శివలింగం

మీకు తెలుసా?

కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామంలోని అటవీ ప్రాంతంలో ఉన్న శివలింగాన్ని స్వయంగా శ్రీరాముడే ప్రతిష్ఠించి, కొలిచినట్లుగా చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది.

- శ్రీరాముడు వనవాసంలో ఉండగా ఇక్కడ లింగంను ప్రతిష్ఠించి, పూజలు చేశాడు. నాటి శివలింగమే నేడు బుగ్గ రామలింగేశ్వరుడిగా పూజలు అందుకుంటున్నాడు.
- మాఘ అమావాస్య రోజున ఈ ఆలయం వద్ద పుణ్యస్నానాలను ఆచరించడానికి భక్తులు భారీగా తరలివస్తారు.
- మహా శివరాత్రి పర్వదినం నాడు బుగ్గ రామలింగేశ్వరుడిని లక్ష మందికి పైగా భక్తులు దర్శించుకుంటారు. శివపార్వతుల కల్యాణోత్సవం, రథోత్సవం మర్నాడు అగ్నిగుండాలు నిర్వహిస్తారు.
- బుగ్గ రామలింగేశ్వర ఆలయంలో 2005 నుంచి నేటి వరకు నిత్యాన్నదానం నిరంతరంగా కొనసాగుతుంది.
- గ్రామస్తులందరు కలిసి స్వయంగా రెండు నెలల రేషన్‌ బియ్యాన్ని అన్నదానానికి విరాళంగా అందజేస్తారు.
- బుగ్గ రామలింగేశ్వర ఆలయ ఆధ్వర్యంలో నిర్వహించే వృద్ధాశ్రమంలో వందమంది వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు.
- 70 ఆవులను ఆలయం ఆధ్వర్యంలో పోషిస్తున్నారు.
- కామారెడ్డి నుంచి నేరుగా బుగ్గ రామలింగేశ్వరుడి ఆలయానికి ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉన్నాయి.

– రామారెడ్డి

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): మండల కేంద్రంలోని స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ)లో పలు కోర్సుల్లో ఉచిత శిక్షణకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్‌ రవికుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి మగ్గం వర్క్‌ (31రోజులు), టైలరింగ్‌ (31 రోజులు) కోర్సులలో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. అభ్యర్థులకు ఉచిత శిక్షణతోపాటు ఉచిత భోజనం, వసతి సదుపాయం ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ ప్రతం అందజేస్తారని తెలిపారు. నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాలకు చెందిన 19 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగిన గ్రామీణ ప్రాంత యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆసక్తి, అర్హత గల వారు తమ వెంట ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, 10వ తరగతి ధ్రువపత్రం, 5 పాస్‌పోర్టు సైజ్‌ ఫోటోలు తీసుకువచ్చి రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఎస్‌బీఐ శిక్షణ కేంద్రం, వెలుగు ఆఫీస్‌ పక్కన, ఘన్‌పూర్‌ రోడ్‌, డిచ్‌పల్లిలో సంప్రదించాలని, లేదా 08461–295428 ఫోన్‌ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎస్సారెస్పీలో 20 టీఎంసీలు దాటిన నీటినిల్వ

- ఎగువ ప్రాంతాల నుంచి కొనసాగుతున్న వరద


ఎస్సారెస్పీలో ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ 20 టీఎంసీలు దాటింది. ప్రస్తుత సంవత్సరం మేలో కురిసిన అకాల వర్షాల నుంచి ప్రాజెక్ట్‌లోకి వరద నీరు ప్రారంభమైంది. ప్రసుతం ప్రాజెక్ట్‌ స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల ప్రాజెక్ట్‌లోకి 4,309 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో ప్రాజెక్ట్‌ నీటి మట్టం క్రమంగా పెరుగుతుంది. ప్రాజెక్ట్‌లోకి జూన్‌ 1నుంచి ఇప్పటి వరకు 10 టీఎంసీల వరద నీరు వచ్చిచేరింది. కాలువల ద్వారా, ఆవిరి రూపంలో ఇప్పటి వరకు 2.26 టీఎంసీల నీటిని వదిలారు. ప్రాజెక్ట్‌ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 359 క్యూసెక్కులు, మిషన్‌ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1068.30(20.63 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే రోజున ప్రాజెక్ట్‌లో 1061.90(12.44 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్‌ టోర్నీ విజేత నిజామాబాద్‌

- రన్నరప్‌గా నిలిచిన ఖమ్మం జట్టు



రామకృష్ణాపూర్‌: మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఠాగూర్‌ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బాలికల జూనియర్‌ ఫుట్‌బాల్‌ టోర్నీ పోటీలు శుక్రవారం ముగిసాయి. లీగ్‌ కమ్‌ నాకౌట్‌ పద్ధతిలో నిర్వహించిన పోటీల్లో నిజామాబాద్‌, ఖమ్మం జట్లు ఫైనల్స్‌కు చేరాయి. ఫైనల్‌ మ్యాచ్‌లో నిజామాబాద్‌ జట్టు ఖమ్మంపై గెలిచి చాంపియన్‌గా నిలిచింది. ఖమ్మం రన్నరప్‌గా నిలిచింది. మూడో బహుమతిని సెమీఫైనల్స్‌లో ఓడిన నల్గొండ, రంగారెడ్డి జట్లకు సంయుక్తంగా అందించారు. మందమర్రి జీఎం దేవేందర్‌ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. క్యాతనపల్లి మున్సిపల్‌ కమిషనర్‌ రాజు, పర్సనల్‌ మేనేజర్‌ శ్యాంసుందర్‌, ఫుట్‌బాల్‌ అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు



ధర్పల్లి: మహిళలను వేధింపులకు గురి చేస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని ఎస్సై కళ్యాణి అన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో షీ టీమ్‌ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు నాంజీ, మోహన్‌ రెడ్డి, రేఖా రాణి, హరిత రాణి, నాగరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

నేనేమి చేశాను పాపం.. నాకేమిటీ శిక్ష?

- పుట్టిన ఆడ బిడ్డను వదిలివెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు
- బాల సంరక్షణ కేంద్రానికి తరలింపు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శిశువు

బిచ్కుంద(జుక్కల్‌): భూమి మీద పడి ఎన్నో గంటలు గడవనే లేదు. ఒళ్లంతా పురిటి రక్తపు మరకలు..బొడ్డు తాడు సరిగ్గా కోయనేలేదు. అమ్మ ఒడిలో ఉండాల్సిన శిశువు, ఎక్కడో బ్రిడ్జి వద్ద పడేసిన అమానుష ఘటన బిచ్కుంద పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. నిర్మానుష్య ప్రదేశంలో వదిలేసిన ఆ శిశువును చూసి స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు. వివరాలు.. బిచ్కుంద– బాన్సువాడ రోడ్డులో శుక్రవారం ఉద యం పెద్దదేవాడ వాగు బ్రిడ్జి వద్ద అప్పుడే జన్మించిన నవజాత శిశువును ఓ గుడ్డలో వదిలేసి వెళ్లిపోయారు. అటు నుంచి వెళ్తున్న వాహనదారులు శిశువు ఏడుపును గమనించి పెద్దదేవాడ గ్రామస్తులకు సమాచారం అందించారు. వారు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై మోహన్‌రెడ్డి చేరుకొని శిశువును పుల్కల్‌ పీహెచ్‌సీకి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వై ద్యం అందించడానికి బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం ఎస్సై, ఐసీడీఎస్‌ అధికారులను పిలిపించి కామారెడ్డి బాల రక్షా భవన్‌ కేంద్రానికి తరలించారు. చికిత్స తర్వాత శిశువు ఆరోగ్యంగా ఉందని వైద్యులు తెలిపారు. ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఆర్మూర్‌లో పోలీసుల తనిఖీలు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలో శుక్రవారం రాత్రి నిషేధిత మాదక ద్రవ్యాలపై ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని పాతబస్టాండ్‌, కొత్త బస్టాండ్‌లో ప్రయాణికుల బ్యాగులను, హోటల్స్‌, పాన్‌షాపులతోపాటు పలు దుకాణాల్లో నిషేధిత మత్తు పదార్థాల, ఇతర చట్టవిరుద్ధ వస్తువులను గుర్తించేందుకు శిక్షణ పొందిన స్నిఫర్‌ డాగ్స్‌ ద్వారా తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల బ్యాగులను తనిఖీ చేశారు. ఎస్సై రమేష్‌, సిబ్బంది పాల్గొన్నారు.

అల్ప్రాజోలం, క్లోరల్‌ హైడ్రెట్‌ పట్టివేత

- రూ.20 లక్షలు విలువ చేయనున్నట్లు పోలీసుల అంచనా



మాక్లూర్‌: మండలంలోని చిక్లి గ్రామం నుంచి ఓ గూడ్స్‌ వాహనంలో కల్తీ కల్లును తయారు చేసే నిషేధిత అల్ప్రాజోలం, క్లోరల్‌ హైడ్రెట్‌ను తరలిస్తుండగా జన్నేపల్లి, పాల్దా రహదారి మార్గమధ్యలో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు పట్టుకున్నారు. వివరాలు ఇలా.. నిషేధిత మత్తుపదార్థాల రవాణాపై విశ్వసనీయ సమాచారం రావడంతో శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డిప్యూటీ కమిషనర్‌ సామిరెడ్డి ఆదేశం మేరకు సిబ్బంది జన్నేపల్లి, పాల్దా రహదారిపై నిఘా ఉంచారు. రహదారిపై అనుమానం వచ్చి టీఎస్‌ 16 యూడీ 0106 నంబర్‌ గల గూడ్స్‌ వాహనంను తనిఖీ చేయగా 4 ప్యాకేట్లలో 50 గ్రాముల అల్ప్రాజోలం లభించింది. వెంటనే నిందితుడిని విచారించగా తన పేరు కొంపల్లి వెంకట్‌గౌడ్‌గా పేర్కొని, స్వగ్రామం మాక్లూర్‌ మండలం చిక్లి అని తెలిపాడు. ఇంట్లో కూడ ఇంకా స్టాకు ఉందని చెప్పటంతో అక్కడ సోదాలు చేయగా 1కేజీ 50గ్రాముల అల్ప్రాజోలంతో పాటు 10.9 కిలోల క్లోరల్‌ హైడ్రెట్‌ లభ్యమైంది. వీటి విలువ అంతర్జాతీయ మార్కెట్లో సుమారు రూ.20లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. వెంకట్‌గౌడ్‌కు రుద్రూర్‌కు చెందిన బొంబాయి రాజాగౌడ్‌ విక్రయించాడని తెలపడంతో అతడిని కూడ అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించారు. సిబ్బంది రాంకుమార్‌, హమీద్‌, అవినాష్‌, ఉత్తమ్‌, భోజన్న, రాంభచన్‌, రాజన్న, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఊర పండుగకు సర్వం సిద్ధం

- నకాస్‌గల్లీలో రూపుదిద్దుకుంటున్న గ్రామదేవతలు
- ప్రతి ఏటా మామిడి కర్రతో కొత్త ప్రతిమల తయారీ
- పాత ప్రతిమలు గోదావరిలో నిమజ్జనం


నకాస్‌గల్లీలో గ్రామ దేవతల ప్రతిమలను తయారుచేస్తున్న వడ్రంగులు

నిజామాబాద్‌ రూరల్‌: ఇందూరు నగరం రేపు జరుగనున్న ఊర పండుగకు సర్వం సిద్ధమైంది. ఊర పండుగ రోజున నగరంలోని 12 బొట్ల కొలువై ఉన్న 14 గ్రామ దేవతల గుడులలో అన్ని కులాల్లోని అన్ని కుటుంబాలు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేయనున్నారు. నగరంలోని అన్ని కులాల ఐక్యతకు ఈ పండుగ నిలయంగా నిలుస్తోంది. 14 గ్రామ దేవతల గుళ్లలో ప్రతి సంవత్సరం ఎప్పటికప్పుడు మామిడి కర్రతో కొత్త విగ్రహాలు ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. నగరంలోని నకాస్‌ గల్లీలో ఈ విగ్రహాలను తయారు చేస్తున్నారు. బండారు పోసిన తరువాత ఈ విగ్రహాల తయారీ ప్రారంభిస్తారు. కొత్త విగ్రహాలను ప్రతిష్ఠించాక పాత విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేస్తారు.

ఖిల్లా గద్దె నుంచి భారీ ఊరేగింపు..

14 గ్రామ దేవతల గుడులకు సంబంధించిన ఊరేగింపు ఖిల్లా గద్దె నుంచి మొదలవుతుంది. ఊరేగింపు పెద్దబజార్‌ చౌరస్తా వద్ద దుబ్బ, వినాయక్‌నగర్‌, సిర్నాపల్లి గడి రోడ్‌ నుంచి విభాగాలుగా విడిపోతాయి. తరువాత 14 గ్రామ దేవతల గుడులకు తీసుకెళ్లి విగ్రహాలను ప్రతిష్టిస్తారు. గాజుల్‌పేటలోని వివేకానంద చౌరస్తా వద్ద భారీ పోలీసు బందోబస్తు మధ్య సరి(ఇంటిపై చల్లుకునే పదార్థం) చల్లుతారు.

ఐకమత్యంతో నిర్వహిస్తున్నాం..

ఎనిమిది దశాబ్దాలుగా నిర్వహిస్తున్న ఊర పండుగలో ఏటేటా పాల్గొనే ప్రజల సంఖ్య పెరుగుతోంది. చిన్న ఊరిగా ఉన్న ఇందూరు నేడు పెద్ద నగరంగా అభివృద్ధి చెందింది. అయినప్పటికీ నగర ప్రజలు ఐకమత్యంతో ఉత్సవాల్లో పాల్గొంటున్నారు.

– బంటు రాజేశ్వర్‌, ప్రధాన కార్యదర్శి, సర్వసమాజ్‌ కమిటీ

ఆనవాయితీ తప్పకుండ...

తరాలు మారినప్పటికీ ఊర పండుగను నిర్వహించే విషయంలో ఆనవాయితీని క్రమంతప్పకుండా ప్రతిఒక్కరూ పాటిస్తున్నారు. సరికి సంబంధించిన వస్తువులు సైతం ప్రతి ప్రాంతానికి సమానంగా పంపిణీ చేయడం జరుగుతోంది.

– ఆదె ప్రవీణ్‌కుమార్‌, కోకన్వీనర్‌, సర్వసమాజ్‌ కమిటీ

ఇంకుడు గుంతలో పడి బాలుడి మృతి


రిత్విక్‌ (ఫైల్‌)

సిరికొండ: మండలంలోని కొండాపూర్‌ గ్రామంలో ఓ బాలుడు ప్రమాదవశాత్తు ఇంకుడు గుంతలో పడి మృతి చెందినట్లు ఎస్సై రామకృష్ణ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. మోపాల్‌ మండలం కులాస్‌పూర్‌ గ్రామానికి చెందిన కొత్త కుమ్మరి రాణి కొన్ని రోజులుగా కొండాపూర్‌లోని తన తల్లిగారింటి వద్ద ఉంటోంది. ఈక్రమంలో రాణి కొడుకు రిత్విక్‌(3) ఇంటి ముందర చిన్న సైకిల్‌పై ఆడుకుంటుండగా, ఇంటి పక్కన గల కోటగిరి నారాయణగౌడ్‌ ఇంటి వద్ద ఉన్న ఇంకుడు గుంతలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. చాలా సేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించి బాలుడిని బయటకు తీసి చికిత్స నిమిత్తం సిరికొండకు అక్కడి నుంచి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బాలుడు మృతిచెందినట్లు నిర్ధారించారు. బాలుడి తల్లి రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో జారిపడి ఒకరు..

రుద్రూర్‌: మండలంలోని అక్బర్‌నగర్‌ గ్రామంలో ఓ వ్యక్తి మద్యం మత్తులో పొలం కాలువ గట్టుపై వెళుతుంగా జారిపడి మృతిచెందాడు. ఎస్సై సాయన్న తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మేత్రి రవి (35) గురువారం మద్యం తాగగ, సాయంత్రం కాలకృత్యాలకు తీర్చుకోవడానికి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. వెంటనే కుటుంబ సభ్యులు వెతుకుతుండగా పొలం కాలువ గట్టుపై నుంచి జారి పడి ఉన్న రవి మృతదేహం లభ్యమైంది. ఈమేరకు శుక్రవారం మృతుడి భార్య సునీత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..


షేక్‌ నబీ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

డిచ్‌పల్లి: తాగుడికి అలవాటు పడిన ఓ వ్యక్తి చివరికి మద్యం ఎక్కువై సరైన తిండి లేక మృతి చెందిన ఘటన మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో చోటు చేసుకుంది. డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్‌ తెలిపిన వివరాలు ఇలా.. ధర్మారం(బి) గ్రామానికి చెందిన షేక్‌ నబీ (41) కూలీ పనులు చేసుకుంటూ జీవించేవాడు. తాగుడికి బానిసగా మారడంతో 15ఏళ్ల క్రితం అతడిని భార్య విడిచి పెట్టి వెళ్లిపోయింది. దీంతో నబీ మరింతగా తాగుడికి అలవాటు పడ్డాడు. ఈక్రమంలో గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన నబీ తిరిగి ఇంటికి రాలేదు. శుక్రవారం ఉదయం ధర్మారం(బి) శివారులోని ఎంఎస్‌ఆర్‌ బార్‌ దగ్గర రేకులషెడ్డు వద్ద నబీ మృతదేహం లభించింది. రాత్రి వరకు బాగా తాగి అక్కడే పడిపోయి చనిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తల్లి షేక్‌ అబేదా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): విద్యార్థులు విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నిజామాబాద్‌ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి ఉదయ్‌ భాస్కర్‌ రావు సూచించారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల/ కళాశాలలో శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయచైతన్య సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. విద్యార్థులు తోటివారితో కలిసి మెలిసి ఉండాలని, ర్యాగింగ్‌ పేరుతో కలహాలు సృష్టించుకోరాదని సూచించారు. పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతకుముందు మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని గురుకుల సిబ్బందికి సూచించారు. మండల ప్రత్యేకాధికారి యోహాన్‌, మండల పరిషత్‌ అధికారి శ్రీనివాస్‌గౌడ్‌, ప్రిన్సిపాళ్లు దివ్యరాణి, లక్ష్మీ, అసిస్టెంట్‌ ప్రిన్సిపాల్స్‌ నిరోష, శ్రావణ్‌, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.